ప్రజాశక్తి
మంగళవారం 28 మే 2024 5
శ్రీ సత్యసాయి

'ఉపాధి' పనుల పరిశీలన

గోరంట్ల : మండలంలోని పులగుల్లపల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనుల ప్రదేశాన్ని సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలు మాట్లాడుతూ 7 వారాల నుంచి పని చేస్తుండగా ఒక ప్లే సిప్ కూడా ఇవ్వలేదని తెలిపారు. రోజుకు రూ. 250 మాత్రమే కూలి పడుతోందన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రని కూలీలు వాపోయారు. కనీసం నీరు, పనిముట్లు పంపిణీ చేయలేదన్నారు. కూలీల సమస్యలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టెక్నికల్ అసిస్టెంట్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట ఇళ్ల స్థలాల కమిటీ నాయకులు రమేష్, బషీర్, స్వర్ణలత, సుజాత ఉన్నారు.

కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యకాసం నాయకులు పెద్దన్న

భూ చట్టం.. అవినీతికి చుట్టం..!



- అసైన్డ్ ఫ్రీ హోల్డ్‌లో అక్రమాలు బోలేడు
- యాజమాన్య హక్కుల పేరిట పేదల భూములు స్వాహా
- లావాదేవీలు జరిగిన అసైన్డ్‌ను ఫ్రీ హోల్డ్ చేసిన రెవెన్యూ అధికారులు
- చేతులు మారిన వందల ఎకరాలు..లక్షలాది రూపాయలు..
- పట్టా భూములను ప్రభుత్వ భూములుగా మార్చిన వైనం
- ఎన్నికల కోడ్ పేరుతో కాసుల దోపిడీ

ప్రజాశక్తి-చిలమత్తూరు

ప్రభుత్వం ఎన్నికలకు ముందు అసైన్డ్ భూములపై సర్వహక్కులు కల్పిస్తూ భూ యాజమన్య చట్టంను తీసుకుని వచ్చింది. దళితులు, గిరిజనుల జీవన, ఆర్థిక ప్రమాణాలను మెరుగు పరిచేందుకు గత ప్రభుత్వాలు ప్రభుత్వ భూములను పంపిణీ చేసింది. వీటిని కేవలం సాగుకు ఉపయోగించుకోవాలని, ఎలాంటి క్రయవిక్రయాలు చేపట్టడానికి వీల్లేకుండా నిబంధనలు విధించింది. కాలక్రమంలో భూములకు విలువ పెరగడంతో అసైన్డ్ భూములపై రియల్టర్లు, పెట్టుబడిదారుల కన్నుపడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన భూ యాజమాన్య చట్టంను రియల్టర్లు, పెట్టుబడిదారులు వారికి అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారు. ఈ చట్టం ప్రకారం అసైన్డ్ భూములు అమ్మేందుకు అవకాశం రావడంతో పేదల చేతుల్లో ఉన్న భూమి కాస్త పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్తోంది. అటూ రెవెన్యూ అధికారులకు కూడా కాసులు కురిపిస్తోంది.

ఫ్రీహోల్డ్‌లో లావాదేవీలు జరిగిన భూములు

సెజ్ మండలంగా పిలవబడే చిలమత్తూరులో వేలాది ఎకరాలు ఇప్పటికే అభివద్ధి పేరిట లేపాక్షి నాలెడ్జ్‌హబ్‌కి కట్టబెట్టారు. రియల్టర్ల కన్ను కాస్త ఈ మండలంపై పడటంతో వేలాది ఎకరాల భూమి అసెన్డ్ భూమా, పట్టా భూమా అని చూడకుండా కొనుగోలు చేసి అసెన్డ్ భూములను పి నెంబర్ రిజిస్ట్రేషన్ చేసుకుని వెంచర్‌లు వేశారు. హిందూపురం కాస్త అహుడా పరిధిలోకి రావడంతో ఆ ఫీజులు ఎందుకు దండగా అని డిగ్రీ లేఅవుట్‌ల పేరిట భారీ ఎత్తున వ్యాపారం సాగుతోంది. ఇలాంటి భూములు నిజానికి ఫ్రీహోల్డ్ చేయకూడదు. చిలమత్తూరు మండలంలో ఇలాంటి భూములను రెవెన్యూ అధికారులు ఫ్రీహోల్డ్ చేసేశారు. చట్టంలో స్పష్టంగా 20 ఏళ్లు ఎలాంటి లావా దేవీలు ఉండ కూడదని చెబుతున్నా ఆ చట్టాన్ని సాకుగా చూపుతూ ఫ్రీహోల్డ్ ఏమీ ఫ్రీ కాదని ఒక్కో ఎకరానికి రూ.30 వేలు చొప్పున కొందరు రెవెన్యూ అధికారులు వసూలు చేసి రియల్టర్ల నుంచి భారీ మొత్తంలో తీసుకుని అలాంటి భూములను కూడా ఫ్రీహోల్డ్ చేశారన్న విమర్శలు ఉన్నాయి. మరి ఉన్నత అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో కాని అప్పటి వరుకు పి నెంబర్‌తో రిజిస్టర్ అయిఉన్న ఆ భూములు కాస్త రియల్టర్ల పేరిట రిలీజ్ అయ్యాయి. సర్వహక్కులూ రియల్టర్లకు దక్కాయి. దీంతో ప్రభుత్వ భూమికి రియల్టర్ యాజమాని అయ్యాడు. ఇలా ఫ్రీహోల్డ్ చేయడానికి ముందు అధికారులు అసెన్డ్‌దారునితో డిజిటల్ వేలిముద్ర వేయించుకోవాల్సి ఉంటుంది. అసెన్డ్‌దారుడితో ఫ్రీహోల్డ్‌కు డిజిటల్ వేలిముద్ర వేయించడంతో అసెన్డ్‌దారుడు తమ భూమి తమకే దక్కింది అనుకున్నాడు. కాని ఫ్రీహోల్డ్ కాగానే సాధారణ మ్యూటేషన్ అయ్యి ఆ భూమి కాస్త కొనుగోలుదారుడి పేరిట 1బి, అడంగల్ ఆన్‌లైన్‌లో వచ్చేస్తోంది.



1-2-2020న కొనుగోలు భూమిగా ఆన్‌లైన్‌లో వివరాలు



అదే భూమి 18-3-2024న ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా మార్పు



From,
Smt.J.Bhagyalatha, M.A
Tahsildar,
Chilamathur Mandal.

To,
The Sub Registrar,
Chilamathur Mandal.

Rc.No.65/2024/B, dated:14.03.2024

Sir,

Sub:- Prohibited properties – Chilamathur Mandal – Demakethepalli village – Sy.No.6-2 Extent 4.44 Acres – The subject survey number not listed in the Notified annexured –I to Annexures-V of Demakethepalli village – Clarification furnished – Reg.

Ref:- 1.Application of Sri.K.A Rahaman S/o K.Alla Bakash, resident of Hindupur village, dt: 14.03.2024.

నిషేధిత భూముల్లో ఈ సర్వే నెంబర్ లేదు అంటూ తహశీల్దార్ ఇచ్చిన లెటర్

పట్టాభూములు డీపట్టాగా మార్పు..!

1954 ముందు అసెన్డ్ భూములను అప్పట్లోనే ప్రభుత్వం పట్టా భూములుగా మార్చింది. ఆ భూములు ఎన్‌ఒసి ఆధారంగా నిషేధిత భూముల జాబితా నుంచి తొలిగించడంతో లావాదేవీలు జరిగాయి. అప్పటి నుంచి పట్టా భూములుగా ఉన్నాయి. ఈ భూములను కూడా అసెన్డ్ ఫ్రీహోల్డ్‌లోకి మార్చడంతో కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. ఈ భూములను భూ స్వభావం వద్ద డీపట్టా, ప్రభుత్వ భూమిగా నమోదు చేశారు. ఇలా చేయడంతో ఇంత కాలం పూర్వపు పట్టాగా ఉన్న భూములు అసైన్డ్ భూములుగా మారాయి. దీంతో సంబంధిత భూ యజమానులు ఆన్‌లైన్‌లో వారి భూమి స్వభావం మార్చాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

డి పట్టా నుంచి పట్టాగా మార్చాలంటే పైసలివ్వాల్సిందే..

డి పట్టా నుంచి పట్టాగా మార్చాలంటే రెవెన్యూ అధికారుల చేతులు తడవల్సిన పరిస్థితులు ఉన్నాయి. అవలీలగా పట్టా భూములను డీ పట్టా గా మార్చేసిన రెవెన్యూ అధికారులు తప్పును సరిచేయాల్సింది పోయి.. దాని కోసం సంబంధిత రైతుల నుంచి అందనికాడికి డబ్బులు గుంజుకుంటున్నారు. డబ్బులిస్తేనే ఆన్‌లైన్‌లో మారుస్తామని డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు తీసుకున్న తర్వాత కూడా సాధారణ పట్టా భూమిగా మార్చేందుకు ఆన్‌లైన్‌లో ప్రస్తుతం ఎడిట్ అదప్షన్ లేదని చెబుతున్నారు. ఓవైపు భూమి డిపట్టాగా మారి, మరోవైపు రెవెన్యూ అధికారులకు డబ్బులిచ్చి రెండు విధాలుగా రైతులు అన్యాయానికి గురయ్యారు. తమకు న్యాయం చేయాలని కనబడిన అధికారులు అందరినీ వేడుకుంటున్నా వీరి గురించి పట్టించుకునే వారు కరువయ్యారు.

తప్పు వారు చేసి రూ.లక్ష ఇవ్వమన్నారు..!

బాధిత రైతు దేమకేతేపల్లి.

చిలమత్తూరు మండలం దేమకేతేపల్లికి చెందిన ఓ మధ్యతరగతి రైతు మరో రైతు నుంచి సర్వే నెంబర్ 6–2లో 4.66 ఎకరాల ఎన్‌ఒసి భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమి పట్టా భూమిగా ఉండేది. ఫ్రీహోల్డ్ సందర్భంగా దానిని ప్రభుత్వ భూమి అని స్వభావంలో మార్చారు. ఆ రైతు ప్రస్తుతం కూతురి పెళ్లి కోసం భూమిని అమ్మకానికి పెట్టాడు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమి అని చూపుతుండటంతో భూమి రిజిస్ట్రేషన్ కాదని సబ్‌రిజిస్టర్ తెలిపారు. దీంతో సదురు రైతు ఓ మధ్యవర్తి సహాయంతో విఆర్‌ఒను ఆశ్రయించాడు. భూమి స్వభావం మార్చాలంటే రూ.లక్ష ఇవ్వాలంటూ రైతుతో బేరం పెట్టాడు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.50 వేలు తీసుకున్నట్లు సమాచారం. రూ.50 వేలు తీసుకుని తహశీల్దార్ నుంచి రిజిస్ట్రేషన్ చేయొచ్చు అనే ఓ అనుమతి పత్రాన్ని ఇప్పించాడు. దీనిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చూపిస్తే చెల్లదని చెప్పారు. ఈ విషయంపై ఓ ప్రజాప్రతినిధి ద్వారా సంబంధిత అధికారులకు ఫోన్ చేయిస్తే ఆన్‌లైన్‌లో భూమి స్వభావం మార్చడం ప్రస్తుతం కుదరదని, రైతు ఇచ్చిన డబ్బులు వెనక్కు ఇచ్చేశామని అధికారులు తెలియజేసినట్లు సమాచారం.

డబ్బుల విషయం నాకు తెలియదు

ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా తప్పుగా పడిన దానిని సరిచేయడానికి రైతు వద్ద డబ్బులు తీసుకున్న విషయం తనకు తెలియదు. రీసర్వేలో భాగంగా పట్టా భూమి పొరపాటుగా ప్రభుత్వ భూమిగా నమోదు అయినమాట వాస్తవమే. ఈ విషయంపై రైతు నా దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సబ్ రిజిస్టర్‌కు లెటర్ ఇస్తే చేస్తారని చెప్తే ఈ మేరకు లెటర్ ఇచ్చాం. ఇందులో సంబంధిత రైతు నుంచి ఎవరు డబ్బులు తీసుకున్నారన్న విషయం నాకు తెలియదు.

భాగ్యలత,
తహశీల్దార్, చిలమత్తూరు.

పారదర్శకంగా, పకడ్బందీగా ఓట్ల లెక్కింపు : జెసి

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికల అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి చిన్న పొరపాటుకు తావివ్వకుండా పారదర్శకంగా, పకడ్బందీగా, సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. జూన్ 4వ తేదీ పట్టణంలోని బిట్ కళాశాల, గురుకుల పాఠశాలలో నిర్వహించే ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సోమవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలపై జెసి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో ఓట్ల లెక్కింపు కౌంటింగ్ కేంద్రాలను వివిధ బ్లాక్‌లలో ఏర్పాటు చేశామని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంటు సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ ఉంటుందన్నారు. కౌంటింగ్ ఉదయం 8:00 గంటలకు ప్రారంభమవు తుందని, నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా పాటించాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎం లలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు అందుబాటులో ఉండి సరి చేస్తారన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్న సందర్భాల్లో సంయమనం పాటించాలన్నారు. అనంతరం ఎలక్ట్రానిక్ మెషిన్ కౌంటింగ్‌కి సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఓటు హక్కు గోప్యత పాటించడం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉందని, ఉల్లంఘనకు పాల్పడిన వారిపై 3 నెలల జైలు శిక్ష, పరిహారం లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో చాలా కీలకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఫారం–13ఎ, 13బి, 13సి, 17సిలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దీంతో పాటు కౌంటింగ్ ప్రక్రియపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, తహశీల్దార్లు శివప్రసాద్‌రెడ్డి, బాల నరసింహులు, భాగ్యలత, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రెడ్డిశేఖర్, ఆర్ఐ అమరేంద్ర పాల్గొన్నారు.

పెనుకొండలో సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో

సోమదేపల్లి : ఎన్నికల ప్రక్రియలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని పెనుకొండ సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వ భరత్ ఆదేశించారు. పెనుకొండ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని భువన విజయం సమావేశం భవనంలో సోమవారం నియోజకవర్గంలోని ఏఈఆర్‌ఓలు, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది తో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశల్లో పాటించా ల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల తహశీల్దార్లు, పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్ పాల్గొన్నారు.

వర్షంతో మూగజీవాలకు మేత

రొద్దం : చినుకు జాడ లేకపోవడంతో రెండు నెలలుగా మేత కోసం మూగజీవాలు తల్లడిల్లాయి. వాటికి గ్రాసం ఏర్పాటు చేయలేక కాపరులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో ఎటు చుసినా పచ్చిక బయళ్లు ఏర్పడడంతో పశువులకు సమృద్ధిగా గడ్డి లభిస్తుంది. దీంతో వాటి కాపరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా గొర్రెల కాపరులు తమ జీవాలను చెరువులు, కట్టకింద భూములు, బీడు భూముల్లోని పచ్చిక బయళ్లలోకి తోలి సేద తీరుతున్నారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

- కాంట్రాక్టర్ శివ శంకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి
- కలెక్టర్‌కు సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు, పిఎఫ్ తక్షణమే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కరించాలని గత వారంలో కార్మికులు నిరసనలు చేపట్టారన్నారు. ఈ సమయంలో కలెక్టర్, తాగునీటి ప్రాజెక్ట్ ఛైర్మన్‌గా స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు కార్మికులంతా నిరసనలు వీడి విధుల్లోకి చేరారని తెలియజేశారు. కాగా కార్మికులు వేతనాల కోసమే కాకుండా విధులకు సంబంధించి కూడా ఇబ్బందులు పడే దుస్థితికి కాంట్రాక్టర్ శివ శంకర్‌రెడ్డి తీసుకొచ్చాడని తెలిపారు. హక్కులు అడిగినందుకు కొంత మంది కార్మికులను తొలగించామంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. నిరసన సమయంలో కార్మికులు మోటార్లు నిలుపుదల చేశారన్నారు. బలవంతంగా కాంట్రాక్టర్ మోటార్‌లు ఆన్ చేయడంతో ఎన్ఆర్‌వి లేనందు వల్ల పైపులు పగిలి తాగునీరు వృథా అయ్యిందని తెలిపారు. ఈ సమస్యకు కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డి కార్మికులను బాధితులుగా చేసి అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశాడన్నారు. వాస్తవానికి కాంట్రాక్టర్ వద్ద సరిపడా యంత్రాలు లేవన్నారు. లీకేజీలను అరికట్టేందుకు కూడా పరికరాలు లేవన్నారు. వీటిని గుర్తించకుండా కాంట్రాక్టర్ కార్మికులను బాధ్యుతలను చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాల్లో కోతలు విధించారని తెలిపారు. కొందరిని తొలగించామంటూ పనులు రావొద్దంటూ బెదిరింపులు, వ్యక్తిగత దూషణలతో దుర్భాషలా డుతున్నారన్నారు. తక్షణం అధికారులు స్పందించి కాంట్రాక్టర్ శివశంకర్‌రెడ్డిని బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. బకాయి వేతనాలు, పిఎఫ్, చెల్లించాలన్నారు. 16 మంది కార్మికులకు 4 నెలల వేతనాలు చెల్లించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ కార్మికులవి న్యాయమైన సమస్యలే అని, ఎన్నికల ఫలితాలు పూర్తవ్వగానే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా నాయకులు మల్లికార్జున, ఐఎఫ్‌టియు నాయకులు ఏసురత్నం, శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి, రాష్ట్ర నాయకులు కొండారెడ్డి, నాయకులు హరిష్, నరేష్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

మహిళా సాధికారతకు చదువు తొలి మెట్టు

పిఆర్ డీఈ మురళీమోహన్

ప్రజాశక్తి-హిందూపురం

మహిళా సాధికారతకు తొలి మెట్టు చదువని, చదువుతోనే అభ్యున్నతి అని, ఆర్థిక స్వావలంబనకు ఉద్యోగం ఎంత దోహదపడుతుందని పంచాయితీ రాజ్ డీఈ మురళీమోహన్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ప్రాంగణ నియామకాలు జరిగాయి. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని 60 మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ హరీష్ బాబు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పిఆర్ డీఈ మురళీమోహన్ హాజరై మాట్లాడారు. మహిళల సవ్యసాచి లక్షణాలు, అకుంఠిత దీక్షాతాత్వం, సమసమాజంలో మహిళలకు ఉద్యోగ ఆవశ్యకతను మానవీయ కోణంలో సమగ్రంగా వివరించారు. అనంతరం ప్రాంగణ నియామకాల్లో ఈసీఈ విభాగం నుంచి 37 మంది, సివిల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి 23 మంది ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల బోధన సిబ్బంది హరినాథబాబు, సత్యకీర్తి, ఫణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన విద్యార్థినులు

ఆలయ హుండీలు లెక్కింపు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టంలోని సూగూరు ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లోని హుండీలను సోమవారం ఆయా ఆలయాల వద్ద అధికారి వన్నూరు స్వామి సమక్షంలో లెక్కించారు. గత 2 నెలల్లో భక్తులు సూగూరు ఆంజనేయస్వామికి హుండీ ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 86,325, గత 7 నెలల్లో భక్తులు వేణుగోపాలస్వామికి సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 1,13,160 ఆదాయం వచ్చిందన్నారు. అలాగే వేణుగోపాలస్వామి ఆలయ ఆధీనంలో ఉన్న ఒక గదికి బహిరంగ వేలం పాటను రూ. 2,600 నుంచి ప్రారంభించగా రూ. 3,100కు వేలంలో దక్కించుకు న్నారు. దీంతో నెలకు రూ. 500 అదనంగా ఆలయానికి ఆదాయం లభించిందన్నారు. కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త నంద కిషోర్, ఈఓ నరసింహారాజు, ఆలయ కమిటీ నిర్వాహకులు, అధికారులు పాల్గొన్నారు.

హుండీలోని కానుకలను లెక్కిస్తున్న అధికారులు

డ్రైవింగ్ లైసెన్స్‌లు ఆర్‌టిఓ ఆఫీస్ నుంచే జారీ చేయాలి

ట్రాన్స్‌పోర్టు రంగం జిల్లా ప్రధాన కార్యదర్శి పెడబల్లి బాబా

ప్రజాశక్తి-సోమందేపల్లి

డ్రైవింగ్ లైసెన్సులను ప్రభుత్వం ద్వారా ఆర్‌టిఓ కార్యాలయం నుంచే జారీ చేయాలని ట్రాన్స్ పోర్టు రంగం జిల్లా ప్రధాన కార్యదర్శి పెడబల్లి బాబా, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. పెనుకొండ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అన్ని రంగాలను ప్రయివేట్‌పరం చేయాలనే కుట్రలో భాగంగా ట్రాన్స్ పోర్ట్ రంగంలో కీలకమైన డ్రైవింగ్ లైసెన్సులు మంజూరు చేయడాన్ని జూన్ 1వ తేదీ నుంచి ప్రయి వేట్ సంస్థలకు అప్పజెప్పడాన్ని సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తూ ప్రజల భద్రత రీత్యా డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసే సందర్భంలో అనేక కొలమానాలతో ఎడ్యుకేట్ చేసే విధానాన్ని తుంగలో తొక్కి ప్రయివేట్ సంస్థలకు అప్పజెప్పడం తగదన్నారు. డబ్బే కొలమానంగా బాధ్యతారహితంగా ఉండే ప్రయివేట్ సంస్థలకు డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేసే అవకాశాన్ని ఇస్తుందంటే కేంద్ర ప్రభుత్వం ప్రజల భద్రత, ప్రాణాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో తెలుస్తుందన్నారు. కేంద్రం ట్రాన్స్‌పోర్ట్ రంగం సర్వీసులను పూర్తిగా ప్రయివేట్ పరం చేయాలనే దుర్మార్గపు ఆలోచన చేస్తుందని, తద్వారా ప్రజలపై పన్నుల రూపంలో భారాలు పడతా యన్నారు. కావున ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని, లేనిచో జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్‌టిఓ కార్యాలయాల ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, మాబాషా, ఆటో యూనియన్ నాయకులు తిప్పన్న, నాగప్ప, షరీఫ్, రాజగోపాల్, రంగప్ప పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాబా, రమేష్

ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలి

కలెక్టర్ అరుణ్‌బాబు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కౌంటింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని అందుకు రాజకీయ పార్టీలు, ఏజెంట్లు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాధవరెడ్డి, డిఆర్ఓ కొండయ్య తో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, వారికి గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని ఫోన్లు నిషేధమనితెలిపారు. పోలీసు ఆంక్షలు తప్పనిసరిగా పాటించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్య కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హిందూపురం సమీపంలోని బిట్ కళాశాల, లేపాక్షిలోని చోళ సముద్రం వద్ద ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసుకుందామని కలెక్టర్ కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 84.70 శాతం పోలింగ్ జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 16,56,775 మంది ఓటర్లు ఉండగా 1852 కేంద్రాలలో 14,03,250 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 20,091 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకే కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ప్రతి అసెంబ్లీకి 14 చొప్పున ఈవీఎం టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ అంతా ఎన్నికల పరిశీలకులు రిటర్నింగ్ అధికారులు కౌంటింగ్ ఏజెంట్లు సమక్షంలో జరుగుతుందన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు లెక్కింపు జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ తో పాటు 30 యాక్ట్ అమలులో ఉందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు చేయకూడదని బాణసంచా కాల్చరాదని ఎవరు కవ్వింపు చర్యలకు పాల్పడరాదని, ఎవరైనా అల్లర్లకు గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి ఎంపీ అభ్యర్థి బికె పార్థసారథి, వైసిపి తరపున వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ తరపున సమాద్ సాహిద్, సోషలిస్ట్ యూనిటీ తరపున రమేష్, ఆర్‌ఎస్పీ తరపున శ్రీనివాసులు, క్రాంతి పార్టీ తరపున ధనుంజయ, ఎన్నికల విభాగపు డిప్యూటీ తహశీల్దార్ మైముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: అధికారులు ,రాజకీయ నాయకులు, పత్రికా ప్రతినిధులు, సిబ్బంది, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటించాలని పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సార్వత్రిక ఎన్నికలలో పోటీచేసిన రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడారు. అభ్యర్థులు కౌంటింగ్ ఏజంట్ల ను నియమించాలని స్ట్రాంగ్ రూం విజిట్ ఉదయం 10 గంటల నుండి 11 గంటలకు, మధ్యాహ్నం 3గంటల నుండి నాలుగు గంటల వరకు అనుమతి ఉందని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి శ్రీరామి రెడ్డి, బిఎస్‌పి గోవిందప్ప, వైసిపి అడ్వకేట్ నాగమల్లేశ్వర్ రెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఖురాన్, అబ్దుల్ ,వెంకటేష్, వేణుగోపాల్ ,గోవర్ధన్, మోపిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి రూరల్ మండల కేంద్రంలోని వీరజిన్నయ్య పల్లికి చెందిన డిగ్రీ విద్యార్థి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు వివరాలు... గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ (19) అనంతపురంలోని పీవీకేకే కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో గ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. అయితే అతని తండ్రి వడ్డే రాజేష్ మద్యానికి బానిసై లేనిపోని సమస్యలు తెస్తున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన విష్ణువర్ధన్ సోమవారం తమ ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పుట్టపర్తి రూరల్ పోలీసులు తెలిపారు.

మృతుడు విష్ణువర్ధన్

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో గ్రామానికి చెందిన రైతు సంకు లోకేష్ కుమార్ కు చెందిన మూడు ట్రాక్టర్ల వరిగడ్డి అగ్నికి ఆహుతైంది. వరిగడ్డి వాములో ఉన్నపలంగా మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు గమనించి స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపులోకి తీసుకొని వచ్చారు. అప్పటికే వరిగడ్డి పూర్తిగా అగ్నికి ఆహుతి అయిపోయింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు దగ్ధమైన వరిగడ్డి వామిని పరిశీలించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

కొత్తచెరువు : గ్రంథాలయంలో పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి జయరాం తెలిపారు గత 13 రోజులుగా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా సోమవారం మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, మాత రమాబాయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగి మహమ్మద్, పాఠకులు రామాచారి, నరసింహులు, భాస్కర, సిబ్బంది మునీరు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

సమావేశంలో మధ్యాహ్నభోజన ఏజెన్సీ నిర్వాహకులు, అధికారులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాశాఖధికారులు చాముండేశ్వరి,సుధాకర్ నాయక్ చెప్పారు. స్థానిక ఎంఇఒ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులు, సహాయకులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకి పోషకాలు ఉన్న పదార్థాలు అందించాలని ప్రతి రోజు ప్రత్యేకమైన మెనూ అమలు చేస్తోందన్నారు. ఏజెన్సీ వారితో పాటు వంటగదిని కూడా పరిశుభ్రంగా ఉంచుకొని వంటను నాణ్యమైన విధంగా తయారు చేసి అందించాలని చెప్పారు. ఈసందర్భంగా జిల్లా రిసోర్స్ పర్సన్ రాణి మాట్లాడుతూ ఏజెన్సీ నిర్వహకులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు అందించేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే తుఫాను, భారీవర్షాలు సమయాలతోపాటు విద్యుత్, అగ్నిప్రమాదం వంటివి జరుగకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం వెనూలో ఉన్న పులిహోర, తీపు అన్నం(స్వీట్ పొంగల్), కాయగూరల అన్నం (వెజిటబుల్‌వలావు) తయారు చేయడం లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు గోపాల్,మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది,ఆయా పాఠశాలల ఏజెన్సీ నిర్వాహకులు హాజరయ్యారు.

ప్రశాంతంగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి కొత్తచెరువు రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈవో మీనాక్షి తెలిపారు. సోమవారం ఇంగ్లీషు పరీక్ష నిర్వహించారని ఈ పరీక్ష కు 972 మంది హాజరుకావాల్సి ఉండగా 315 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారన్నారు. కేవలం 32 శాతం మంది మాత్రమే హిందీ పరీక్షకు హాజరైనట్లు డీఈవో చెప్పారు. జిల్లా పరిధిలో 29 కేంద్రాలలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

రైతురుణమాఫీ చేయాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రైతుల రుణాలు రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి జేవీరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డీఏవోకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయిజిల్లాలో 32 మండలాలకు గాను 21 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారన్నారు. వాటిలో కూడా కరువు సహాయక చర్యలు ఇంతవరకు చేపట్టలేదని విమర్శించారు. గత రబీ, ఖరీఫ్ సీజన్లో వర్షాలు లేక నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విత్తన, ఎరువులను కేవలం నామమాత్రంగా ఉన్నాయని, వాటిని90 శాతం రాయితీతో అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీటర్ రీడర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెం టి కిరణ్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు కుళ్లాయప్ప, ఏపీ చేనేత కార్మికసంఘంజిల్లా గౌరవాధ్యక్షులు గుర్రం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : సత్యసాయి జిల్లాలోని 32 మండలాలకు గాను కరువు మండలాలుగా 21 మండలాలను గుర్తించారని అయితే కరువు మండలాలకు కరువు సహాయం ప్రకటించిందే లేదని ఏపీ రైతు సంఘం నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిత్రాన్ని ధర్మవరం ఏడిఏకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

శాంతియుతంగా జీవిద్దాం : డీఎస్పీ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ప్రజలందరూ కక్షలకు దూరంగా ఉండి శాంతియుతంగా జీవనం సాగించాలని డీఎస్పీ శ్రీలత తెలియజేశారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కదిరి అంబేద్కర్ సర్కిల్లో సోమవారం నాడు మాక్ ఆపరేషన్ పోలీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాక్ డ్రిల్‌లో భాగంగా ఎన్నికల కౌంటింగ్ రోజు ఎవరైనా వ్యక్తులు గుంపులుగా చేరి సమస్య సృష్టిస్తే పోలీసులు ఏ విధంగా ఎదుర్కోవాలి అనే దానిని తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజు ఎవరైనా అల్లర్లకు పాల్పడితే అలాంటి వారిపై శాశ్వత బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, మోహన్, ఎస్ఐ బాబ్జాన్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పోలీసుల ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో పోలీసులు సోమవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సిఐలు, ఎస్ఐ లు సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సమస్యాత్మకమైన ప్రాంతాలలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా దాచి వుంచిన బాణాసంచా, పెట్రోలు, డీజిల్, పత్రాలు లేని అనుమానిత వాహనాలను సీజ్ చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్లో సిఐలు ,ఎస్ఐలు సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. మడకశిర సర్కిల్ పరిధిలో అనుమతులు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అదేవిధంగా అనుమానిత పరిసరాలను క్షుణంగా తనిఖీలు చేశారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో, తర్వాత కూడా జిల్లాలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రతలను పరిరక్షించే ఉద్దేశంతో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో పాటు, శాంతి కమిటీల వారితో పోలీసులు సమావేశం నిర్వహించి ఎన్నికల కౌంటింగ్ అనంతరం కూడా ఎలాంటి అల్లర్లు,గొడవలు జరగకుండా సహకరించాలని సూచనలు చేశారు.

గడ్డివాముల్లో సోదాలు చేస్తున్న పోలీసులు

బత్తలపల్లి : మండలవ్యాప్తంగా పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ సోమవారం కొనసాగింది. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మండలంలోని గ్రామాలలో పోలీసులుకార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు నేతృత్వంలో పోలీసులు సోమవారం మండలంలోని వెంకటగారిపల్లిలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మద్యం విక్రయించే వారి ఇళ్లలో సోదాలు చేశారు. రౌడిషీటర్లు, గొడవలకు పాల్పడే వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం గ్రామసభ నిర్వహించి గొడవలకు దూరంగా వుండాలని, గ్రామంలో ఏవైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండలో పోలీసులు సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లు సోదా చేశారు. కౌంటింగ్ రోజు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకి పాల్పడవద్దని 144 సెక్షన్ అమలు ఉందని హెచ్చరించారు. అలాగే ఓ ఇంట్లో అక్రమంగా అమ్ముతున్న కర్నాటక మద్యం 192 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని రిమాండ్ కి తరలించినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు.

జిల్లావ్యాప్తంగా బాణసంచా విక్రయాలు నిషేధం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లావ్యాప్తంగా బాణసంచా తయారీ, అమ్మకం, వాటిని కాల్చడం నిషేధించామని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 ఎన్నికలనేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జూన్ నెల 5 వరకు జిల్లాలో ఎక్కడ కూడా ఫైర్ ట్రాకర్లు తయారీ, అమ్మకం కొనుగోలు వినియోగంపై నిషేధం విధించామన్నారు. ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్, ఫలితాలు దృష్ట్యా ఎక్కడ ర్యాలీలు విజయోత్సవాలు నిర్వహించే కార్యక్రమంలో బాణసంచా కాల్చడం వాటి వల్ల తలెత్తే పరిణామాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ నివేదిక మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడ కానీ బాణసంచా అమ్మకాలు జరపరాదన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే 1860 చట్టం 436 సెక్షన్ ప్రకారం శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ నిషేధాన్ని గుర్తించి సహకరించాలని సూచించారు.

బడి వయసు పిల్లలు బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి - నల్లచెరువు

బడి వయస్సు పిల్లలు బడిలోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సహిత విద్యా సమన్వయ కర్త ఆనంద్ బాబు , మండల విద్యాశాఖ అధికారులు తిరుపాల్ నాయక్, చెన్నకేశవకుమార్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల ఒకటవ తేదీ నుంచి జూన్ నెల 11 వ తేదీ వరకు మండలంలోని0 నుండి 18 సంవత్సరాల వయస్సు లోపు వున్న దివ్యాంగ పిల్లలను గుర్తించడం , పాఠశాలలో పేరు నమోదు కాని పిల్లలను పాఠశాలలో చేర్పించడం, అలాగే బడి మానేసి బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించడం కోసం సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక ఉపాధ్యాయులు కె. నరసింహులు, పి. వినయ్ మండలం లోని అంగన్వాడీ టీచర్లు , గ్రామ సచివాలయాలు సంప్రదించి పిల్లల ఇంటికి వెళ్లి తల్లి దండ్రుల ద్వారా సమాచారం సేకరించి సర్వే చేస్తున్నారన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS
(O/o DISTRICT REGISTRAR)
ANANTAPURAMU.
DISPUTE No. DRA/CFS/24/2024.
Between:
KAPIL CHITS HYDERABAD PVT. LTD., Kadiri Represented by its Legal Officer, ... DISPUTANT
AND
S.YOGESWARA & 3 Others ... OPPONENTS
NOTICE TO OPPONENTS No.1 to 4
Op.1. S.Yogeswara, S/O.S.Lakshminarayana, Hindu, A/a. 49 Years, D.No: 1/1135-6 Ni, Adapala Street, Kadiri (M), Sri Sathya Sai (D).
Op.2. K.Hemalatha, W/O T.Mb.Bhagavan Das, Hindu, A/a. 61 Years, D.No.1-77-6- E, Revenue Colony, Kaidri (M), Sri Sathya Sai (D).
Op.3. K.Kondaiah, S/O K.Balappa, Hindu, A/a. 49 Years, Manager In Kapil Chits Hyd. Pvt. Ltd., Kadiri Branch; D.No.1-616-1 A, Sri Taki Towers, Kadiri (M), Sri Sathya Sai (D)
Op.4. S.Shabana, W/O D.Sadiq Ali Khan, Muslim, A/a. 39 Years, Accounts Officer, Kapil Chits Hyd Pvt Ltd Kadiri Branch; D.No.1-616-1A, Sree Tayi Towers, Kadiri (M), Sri Sathya Sai (D)
Where as the Disputant Chit Fund Company, in the above Dispute has instituted the above Dispute for recovery of money for Rs.22,702/- and the same is posted for your appearance in the said Court on the 19-06-2024 by 11:00 a.m. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparty.
(By Order of Deputy Registrar of chits
O/o of the District Registrar,
Registration and Stamps Dept.
D.No.6-3-134, Ist Floor,
Ram Nagar,Anantapuramu)

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS
(O/o DISTRICT REGISTRAR)
ANANTAPURAMU.
DISPUTE No. DRA/CFS/22/2024.
Between:
KAPIL CHITS HYDERABAD PVT.LTD., Anantapuramu Represented by its Legal Officer, ... DISPUTANT
AND
K.NARASIMHA REDDY & 5 Others ... OPPONENTS
NOTICE TO OPPONENTS No.1 to 6
Op.1. K.Narasimha Reddy, S/O.K.Appi Reddy, Hindu, A/a. 45 Years, Prop Of Mobile Shop At Kadiri; D.No: 41-6, Kothapalli (V), Talupula (M), Sri Sathya Sai (D)
Op.2. K.Gangi Reddy, S/O.K.Appi Reddy, Hindu, A/a. 34 Years, Prop Of Mobil Shop At Kadiri; D.No: 6-48, Kothapoola Vandlapalli, Vepamampeta, Anantapurmu (D)
Op.3. P.Jaya Chandra, S/O.P.Ramappa, Hindu, A/a. 49 Years, Is Working As Manager At Kapil Chits Hyd Pvt Ltd At Kadiri; D/No.1-616-1, 2nd Floor, Tai Towers, Indira Gandhi Circle, Kadiri (M), Sri Sathya Sai (D)
Op.4. S.Shabana, W/O.D.Sadiq Ali Khan, Muslim, A/a. 39 Years, Is Working As Ao At Kapil Chits Hyd Pvt. Ltd. At Kadiri; D.No.1-616-1, 2nd Floor, Tai Towers, Indira Gandhi Circle, Kadiri (M), Sri Sathya Sai (D)
Op.5 C.Ramesh, S/O.C.Lakshmi Narayana, Hindu, A/a. 39 Years, Is Working As Manager At Kapil Chits Hyd Pvt Ltd At Dmm; D.No.15-283, 2nd Floor, Gln Complex, Kala Jyothi Circle, Dharmavaram (M), Sri Sathya Sai (D)
OP.6 M.Gowthami, W/O.K.C.Obi Reddy, Hindu, A/a. 31 Years, Is Working As Ao At Kapil Chits Hyd Pvt Ltd At Dmm; D.No.15-283, 2nd Floor, Gln Complex, Kala Jyothi Circle, Dharmavaram (M) Sri Sathya Sai (D)
Where as the Disputant Chit Fund Company, in the above Dispute has instituted the above Dispute for recovery of money for Rs.31,674/- and the same is posted for your appearance in the said Court on the 19-06-2024 by 11:00 a.m. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparte.
(By Order of Deputy Registrar of chits
O/o of the District Registrar,
Registration and Stamps Dept.
D.No.6-3-134, Ist Floor,
Ram Nagar, Anantapuramu)

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే

గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

బత్తలపల్లి : మండలంలోప్రత్యేక అవసరాలు గల 0నుండి 18 వయస్సు లోపు ఉండే వికలాంగ పిల్లల సర్వేను శ్రీసత్యసాయి జిల్లా సహిత కోఆర్డినేటర్ అలెస్కో ఆనందబాబు పర్యవేక్షించారు. సోమవారం బత్తలపల్లి మండలంలోని పోట్లమర్రి గ్రామంలో ఐయిఆర్‌ఫిలు గుర్తించిన హేమశ్రీ ఇంటితోపాటు గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఆయన పరిశీలించారు.. ఈ సందర్భంగా అలెస్కో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారికి ఎస్కార్ట్ ట్రాన్సుపోర్టు,లేడిస్ స్టైయిఫెండ్, అమ్మఒడి, ఉచిత పాఠ్య పుస్తకాలు,యూనిఫామ్,బూట్లు మొదలగు విద్యా సామాగ్రి అందజేస్తారన్నారు. భవితా సెంటరులలో ఫిజియోథెరఫి, స్పీచ్ థెరఫి,ఉపకరణాలు ఉచితంగా లభిస్తాయని వివరించారు. మండలంలో ఇప్పటివరకు గుర్తించిన 225 మందితో పాటు కొత్తగా 42 మందిని గుర్తించామని చెప్పారు. వయస్సు తగినట్లు ప్రభుత్వ పాఠశాలలోను, అంగన్వాడీల్లోనూ వారిని చేర్పిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐయిఆర్పిలు ప్రసాద్, ఖాదిరెడ్డితో పాటు మండల విద్యా శాఖాధికారులు ఛాముండేశ్వరి, సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిపిఎంఓ డాక్టర్ కేసి కుల్లాయప్ప నాయక్ సోమవారం తనిఖీ చేశారు. ఈ హెచ్ ఆర్ (ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్) తప్పకుండా కలిగి ఉండేటట్లు చూడాలని ప్రతి పేషెంట్ ను ఈహెచ్‌ఆర్ చేయాలని ఆదేశించారు. ఎబిహెచ్ఎఐడి, ఈహెచ్‌ఆర్ నమోదు వలన పేషెంట్ ఏ డాక్టర్ వద్దకు వెళ్లి నంబర్ చెప్పిన దాని ద్వారా అతని ఆరోగ్య పరిస్థితి డాక్టర్ తెలుసుకొని తగు చికిత్స చేయుటకు సులువు అవుతుందన్నారు. అనవసర సమయం, పరీక్షలు ఉండవన్నారు. పేషంట్ అపస్మారక స్థితిలో ఉన్నా బయోమెట్రిక్ ఐడెంటికేషన్ ద్వారా అతని పూర్వపు ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని తగు చికిత్స చేయుటకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ జోష్న, డాక్టర్ మునిచంద్రిక, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సీనియర్ అసిస్టెంట్ జిగును, స్టాఫ్ నర్స్ పద్మావతి, సునీత పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జెవివి ప్రతినిధులు, తదితరులు

గణితంలో సందేహాల నివృత్తి

ప్రజాశక్తి - కదిరి టౌన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కదిరి లో నిర్వహిస్తున్న వేసవి వినోదం కార్యక్రమంలో భాగంగా సోమవారం గణిత శాస్త్రం లో సందేహాల నివృత్తి, సులభ సాధన సదస్సు నిర్వహించారు. పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గణిత శాస్త్రంలోని సందేహాలను నివృత్తి చేశారు. వివిధ రకాల పుష్పాలు గిఫ్ట్ బాక్సులు సీతాకోకచిలుక తయారీలో విద్యార్థులతో శిక్షణ ఇచ్చారు.

మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన చంద్రా నాయక్ కుటుంబానికి 50వేల రూపాయల చెక్కు ను ఎస్పీ మాధవ్ రెడ్డి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ ఏప్రిల్ 11న గుండెపోటుతో మృతి చెందిన ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ చంద్ర నాయక్ కుటుంబానికి జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పి ఛాంబర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రానాయక్ భార్య శాంతమ్మకు,జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి వీడో ఫండ్ కింద 50వేల రూపాయల విలువజేసే చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, మృతుడి కుటుంబానికి రావలసిన ఇతర ఆర్థిక సహాయాన్ని కూడా త్వరలోనే అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి చెక్కు అందజేత

యూనియన్ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-హిందూపురం

దేశంలోనే అత్యధిక గుర్తింపు పొందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సాధారణ వర్గాల నుండి ఉన్నతమైన వర్గాల వారికి వివిధ రకాల రుణ సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తోందని ఈ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ (అనంతపురం) జితేంద్ర మిశ్రా పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వాసవి ధర్మశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలపై(మెగా రిటైల్ ఎక్స్‌పో) మెగా అవగాహన సదస్సు(రుణమేళా) నిర్వహించారు. స్థానిక బ్యాంక్ మేనేజర్ దయాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రీజినల్ మేనేజర్ జితేంద్ర మిశ్రా మాట్లాడుతు యూనియన్ బ్యాంకు నియమ నిబంధనల మేరకు వివిధ రకాల రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మరింత మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రత్యేకంగా మెగా రిటైల్ ఎక్స్ పో(రుణమేళా) అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అర్హత గల వారికి సరసమైన వడ్డీరేట్లతో ద్విచక్ర వాహనాలకు, కార్లు, గృహ నిర్మాణాలకు, ఉన్నత విద్యాభివృద్ధికి విద్యా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అర్హత గలవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌హెచ్ భూషణ్ రెడ్డి, ఆర్ఎల్‌పి వెంకటేశ్వర్లు, సమీప ప్రాంతాల యూనియన్ బ్యాంక్ మేనేజర్లు, బిల్డర్స్, కారు, ద్విచక్ర వాహన షోరూం డీలర్లు, కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ జితేంద్ర మిశ్రా

ఎన్నికల ఓట్ల లెక్కింపుపై శిక్షణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

2024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఆర్డీవో భాగ్యరేఖ ఆధ్వర్యంలో అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పుట్టపర్తి నియోజక వర్గం , రెవిన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్సు , సిబ్బంది కి సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పై శిక్షణా కార్యక్రమం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి తహశీల్దార్ వేణుగోపాల్, బుక్కపట్నం భారతి, నల్లమడ నాగభూరీషణం, ఆమడగురు రామణారెడ్డి, డి ఎఒఎం వెంకటస్వామి, ఇడిఎం షేక్షావలి, విఆర్ఒ శ్రీరాములు పాల్గొన్నారు.